క్లుప్తంగా

మొక్కలు నాటి రక్షించాలి



చెన్నారావుపేట : ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సర్పంచ్ సుంకరి లావణ్య అన్నారు. ఈ మేరకు మండలంలోని పాతమ గ్దుంపురంలో గురువారం 7వ విడత హరిత హారంలో భాగంగా మొక్కలు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ మేకల సదయ్య, మహ్మద్ శంశో ద్దీన్, ననుమాస కర్ణాకర్, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

నేడు ప్రాంగణ నియామకాలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ ఫార్మసీ కళాశాలలో నేడు ప్రాంగణ నియామకాలు చేపట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంసుందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు అవోదా సౌజన్యంతో కళాశాలలో ప్రాంగణ నియామకాలు ఉంటాయని, వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఫార్మాసీ, తాళ్ల పద్మావతి కాలేజీ ఆఫ్ ఫార్మాసీ, నేతాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ విద్యార్థులతోపాటు బాలాజీ ఫార్మాసీ కళాశాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు సకాలంలో హాజరై ప్రాంగణ నియామకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మనీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో చేరేందుకు నేడు చివరి అవకాశం

వర్ధన్నపేట : ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరడానికి నేటి(శుక్రవారం)తో గడువు ముగుస్తుందని వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా అందరికి అందుబాటులో ఉన్న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని, నాణ్యమైన విద్య, సుశిక్షితులైన అధ్యాపకులు ఉన్నారని, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ బోర్డ్, తరగతి గది, సైన్స్ ల్యాబ్, ఎన్ఎస్ఎస్ సదుపాయాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ కళాశాల అందిస్తున్న సేవలను విద్యార్థులు, తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



నర్సంపేట : రాజకీయ కుట్రలతో బీసీలను అణచివేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు గుండాల మదన్‌కుమార్, జిల్లా సలహాదారులు డాక్టర్ వీఎం.జయుడు, ఉపాధ్యక్షుడు జీజుల సాగర్, ప్రధాన కార్యదర్శి పెండెం భాస్కర్ అన్నారు. ఈ మేరకు ఈనెల 15వ తేదీన హైదరాబాద్ ఎల్బీనగర్ మన్సూరాబాద్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో జరిగే బీసీల రాజకీయ ప్లీనరీ వాల్‌పోస్టర్‌ను గురువారం జిల్లా అధ్యక్షుడు బొమ్మ నాగరాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ద్యాగల శ్రీనివాస్ పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో బీసీలకు దక్కాల్సిన వాటా దక్కడం లేదని విమర్శించారు. బీసీలు ఓటు బ్యాంకుగా మాత్రమే పరిగణించబడుతున్నారన్నాని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ నాయకులందరూ పార్టీలకతీతంగా ప్లీనరీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శీరంశెట్టి రాజేందర్, కొమురయ్య, ఆవుల పృథ్వీరాజ్, వాడపల్లి రమేష్, గువ్వ రాజ్‌కుమార్, శ్రీధర్ ఉన్నారు.

మురుగు నీటితో దుర్వాసన



వర్ధన్నపేట : పారిశుద్ధ్య లోపంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్ధన్నపేట ప్రధాన రహదారి అంబేడ్కర్ కూడలి వద్ద డ్రెయినేజీలో చెత్తాచెదారంతో నిండి మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతుంది. సమీపంలోనే ఆటో స్టాండ్ ఉండడతో ప్రయాణికులు ఆటోల్లో దిగుతూ, ఎక్కుతూ నిత్యం రద్దీగా ఉంటుంది. దుర్వాసన భరించలేకుండా ఉండడంతో డ్రైవర్లు, ప్రయాణికులు అనేక అవస్థలకు గురవుతున్నారు. ఇప్పటికైనా డ్రెయినేజీలో నిలిచిన మురుగు నీరు, చెత్తా చెదారాన్ని తొలగించి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడి మృతి



లింగం నాయక్ (ఫైల్)

చెన్నారావుపేట : బీఆర్ఎస్ మండల నాయకుడు భూక్యా లింగం నాయక్(63) గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. కాగా ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, సేవాలాల్ ఉత్సవ కమిటీ నాయకులు డాక్టర్ ఉదయ్‌సింగ్, భద్రయ్య, గోల్యా నాయక్, మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, ఎంపీపీ బాదావత్ విజేందర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్‌లు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు లింగం నాయక్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గీసుకొండ: కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు



దుగ్గొండిలో..



ఖానాపురంలో..



నర్సంపేట రూరల్: జీపీ కార్మికుల దీక్షలో మాట్లాడుతున్న రాగసుధ

నర్సంపేట రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో కార్మికులతో వెట్టి చేయించుకుంటుందే తప్ప.. వారి సమస్యలు పరిష్కరించడం లేదని ఎంసీపీఐ (యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు వంగాల రాగసుధ తెలిపారు. ఈ మేరకు నర్సంపేట మండల పరిషత్ కార్యాలయంలో జీపీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం 8వ రోజు కొనసాగాయి. ఈసందర్భంగా ఎంసీపీఐ(యూ) నాయకులు వారికి సంఘీభావం తెలిపారు. ఎంసీపీఐ(యూ)జిల్లా అధ్యక్షుడు మాషుక్, మండల కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, జీపీ జేఏసీ మండల అధ్యక్షుడు పున్నం ఆనంద్, నాయకులు జన్ను శ్రీనివాస్, ఎండీ యాకుబ్‌పాష, పోలబోయిన శ్రీనివాస్, నర్సయ్య, కృష్ణ, రమేష్, శ్రీశైలం, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

చెన్నారావుపేట : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన దీక్షలు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు దూడయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ సమ్మెలో కార్మికులు అశోక్, సురేందర్, సురేష్, పాషా, ఉపేందర్, భిక్షపతి, తదితరులు ఉన్నారు.

కళ్లకు గంతలతో నిరసన

గీసుకొండ : మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామపంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం కళ్లకు గంతలతో నిరసన తెలిపారు. గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ అలీ, ప్రధాన కార్యదర్శి కుమ్మరికుంట్ల రమేశ్, మండల అధ్యక్షులు వెలిబోజు కనకాచారి, ప్రధాన కార్యదర్శి వాంకుడోతు బుచ్చయ్య, ప్రచార కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

దుగ్గొండిలో..

దుగ్గొండి : మండల కేంద్రంలో గ్రామపంచాయతీ సిబ్బంది కళ్లకు గంతలు కట్టి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు గాదం రాజాలు, జేఏసీ ప్రధాన కార్యదర్శి పొన్నం రమేష్, మాము నూరు యాకయ్య, భగవాన్‌రెడ్డి, పానకల్ రమేష్, బాబుమియా, సదయ్య, అబ్బోజు సాంబయ్య, సత్యం, గంధం సాంబరాజు పాల్గొన్నారు.

ఖానాపురంలో..

ఖానాపురం : జీపీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మిక జేఏసీ అధ్యక్షుడు కాసు యాకయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన సమ్మె గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులు కళ్లకు గంతలతో నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి బాధాకరమన్నారు. జీపీ కార్మికులు వెంకటాచారి, మేడిద అనిల్ కుమార్, ఉస్మాన్, కుమారస్వామి, బోడ వీరన్న, ఉపేందర్, యాకుబ్, రవీందర్ పాల్గొన్నారు.



సంగెం: మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

కార్మికులకు విజయ్‌చందర్‌రెడ్డి సంఘీభావం

సంగెం : గ్రామపంచాయతీ సిబ్బందిల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బీజేపీ పరకాల ఇన్‌చార్జ్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సంగెంలో నిరవధిక సమ్మె చేస్తున్న జీపీ కార్మికులకు ఆయన సంఘీభావం తెలియజేశారు.

రైతులకు అండగా బీఆర్ఎస్



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న అరూరి రమేశ్

వర్ధన్నపేట : బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉండి వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. గురువారం వర్ధన్నపేట పరిధిలోని డీసీతండాలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దమ్మన్నపేట గ్రామానికి చెందిన గజవెల్లి ప్రభాకర్ సీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయనన శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సమ్మయ్య, గణపతి, ఈశ్వర్, శ్రీరంగం, రమేష్, చిరంజీవి, రవీందర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

నర్సంపేట : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సంక్షేమ ఫలాలు అన్ని వర్గాల వారికి అందుతాయని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని గురువారం పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ అధ్యక్షతన నర్సంపేటలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాటలకు, చేతలకు పొంతన లేకుండా ప్రజా సొమ్ము దోచుకు తింటూ బయటికి మాత్రం శత్రువుల్లాగా డ్రామాలు ఆడుతూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. ఇదంతా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. సమావేశంలో పెండెం రామానంద్, రవీందర్‌రావు, వేముల సాంబయ్యగౌడ్, ఓర్సు తిరుపతి, చింతల సాంబరెడ్డి, కాట ప్రభాకర్, కౌన్సిలర్లు ఎలకంటి విజయ్‌కుమార్, ములుకల వినోదసాంబయ్య, నూను పద్మ, మసూద్, ఇస్లావత్ పద్మభాయి, తుమ్మలపల్లి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీదే అధికారం

బీజేపీ రాష్ట్ర నాయకుడు రేవూరి ప్రకాశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి

నర్సంపేట /నల్లబెల్లి : రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో పట్టణ స్థాయి, నల్లబెల్లిఓ మండలస్థాయి కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన బహిరంగ సభ విజయవంతమైందని, దేశంలో, తెలంగాణలోనూ కుటుంబ పార్టీలకు కాలం చెల్లిందన్నారు. ఈ సమావేశంలో బాల్నె జగన్, రేసు శ్రీనివాస్, చిలువేరు రజనిభారతి, పంజాల రాము, గుంటి రవిప్రకాశ్, జూలూరి మనీష్‌గౌడ్, సందీప్ పాల్గొన్నారు.

పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పెంచిన వేతనాలను వెంటనే అమలు చేయాలని ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు ఎండి.మాషుక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెంచిన వేతనాలను కేవలం శానిటేషన్ కార్మికులకు మాత్రమే వర్తింప చేస్తున్నారని అన్నారు. కాంట్రాక్ట్ వర్కర్స్, వివిధ కేటగిరీలో పని చేస్తున్న కార్మికులకు పెంచిన వేతనాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వంగాల రాగసుధ, ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి కొత్తకొండ రాజమౌళితో పాటు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



రమేష్, అధ్యక్షుడు



యమ్మ రమేష్, యూత్ కార్యదర్శి

ఖానాపురం : మండలంలోని కొత్తూరు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా జాటోత్ రమేష్, కార్యదర్శిగా మేరుగు రవి, యూత్ అధ్యక్షుడిగా కుసుబాధ అనిల్, ఉపాధ్యక్షుడిగా పట్టాపురం రంజిత్‌కుమార్, యూత్ కార్యదర్శిగా యమ్మ రమేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా జాటోత్ విజేందర్‌రెడ్డి, రాకేష్, అనిల్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీఎస్ సీపీఎస్ఈయూ మండల కమిటీ..



శ్యాంప్రసాద్, అధ్యక్షుడు



ఎస్.మల్లయ్య, ప్రధాన కార్యదర్శి

నర్సంపేట టీఎస్ సీపీఎస్ఈయూ మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పి.శ్యాంప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.మల్లయ్య, కోశాధికారిగా బి.నర్సింహ, సహాధ్యక్షుడిగా ఎస్.గోపాల్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఖానాపురం, చెన్నారావుపేట, నల్లబెల్లి మండల బాధ్యులు, సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నివేశన స్థలాలు పంపిణీ చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీకాంత్

వర్ధన్నపేట : దళిత కుటుంబాలకు నివేశన స్థలాలు పంపిణీ చేయాలని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. దళితుల భూములను సర్వేల పేరుతో లాక్కోవద్దని సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గురువారం వర్ధన్నపేట తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. వర్ధన్నపేటతో పాటు మండలంలోని నల్లబెల్లి, చెన్నారం గ్రామాల్లో 2009 సంవత్సరంలో కాంగ్రెస్ నిరుపేదలైన దళితుల నివేశన స్థలాల కోసం పట్టాలు మంజూరీ చేశారన్నారు. కార్యక్రమంలో బిర్రు చంద్రయ్య, లక్ష్మణ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్ : బీఆర్ఎస్ పార్టీ అసత్యపు ప్రచారాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ముగ్దుంపురం గ్రామ అధ్యక్షుడు వరంగంటి కుమారస్వామి, ఎంపీటీసీ చీకటి స్వరూప ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ ఇస్లావత్ గోపి నాయక్, ఉపాధ్యక్షుడు ఇస్లావత్ నరావన్, వార్డు సభ్యులు వెల్దండి భారతిమధు, మాజీ వార్డు సభ్యులు గన్నోజు రవీంద్రచారీ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

నెక్కొండ : గ్రామపంచాయతీ పరిధిలోని 7వ వార్డులో గురువారం సీసీరోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. దేవనబోయిన వీరభద్రయ్య, వార్డు సభ్యులు మహ్మద్ ఇమాంబీ, రామారపు శిరీష, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి పగటి కలలు కంటున్నారు..



నల్లబెల్లి : విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నెక్కొండ: రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున బీఆర్ఎస్ నాయకులు

జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న

నల్లబెల్లి / రాయపర్తి /దుగ్గొండి /ఖానాపురం / నెక్కొండ : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తుందని రేవంత్‌రెడ్డి పగటి కలలు కంటున్నారని జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న విమర్శించారు. 24గంటల ఉచిత విద్యుత్ సరఫరాతో రైతు పక్షపాతిగా బీఆర్ఎస్ వ్యవహరిస్తున్న తీరు కాంగ్రెస్‌కు మింగుడు పడడం లేదని స్వప్న అన్నారు. అలాగే ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా గురువారం ఆయా మండలాల్లోని సబ్‌స్టేషన్‌ల ఎదుట బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌పై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డీపీఎం దివ్య

గీసుకొండ : పంచాయతీ కార్యదర్శులు ఈ–పంచాయతీ వెబ్‌సైట్, పలు అప్లికేషన్లు, ఆన్‌లైన్ ప్రక్రియపై అవగాహన పెంపొందించుకోవాలని వరంగల్, నర్సంపేట డీఎల్పీఓలు కీర్తి ప్రభాకర్, వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని గంగదేవిపల్లిలో గీసుకొండ, వర్ధన్నపేట, దుగ్గొండి మండలాల పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఆన్‌లైన్ ప్రక్రియపై గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రతీ రోజు ఉదయం 8 గంటల్లోపు డీఎస్ఆర్ పూర్తి చేయాలని, స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేకు సిద్ధం కావాలని, ఇంటి పన్నుల వసూళ్లు, రోజు వారీ కార్యక్రమాలు, రికార్డుల నిర్వహణ సరిగా చేయాలన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియపై ప్రొజెక్టర్ ద్వారా డీపీఎం దివ్య అవగాహన కలిగించారు. స్వచ్ఛ భారత్ కన్సల్టెంట్ శ్రీనివాసరావు, ఎంపీఓలు ఆడెపు ప్రభాకర్, ధనలక్ష్మి, శ్రీధర్ పాల్గొన్నారు.

వరిలో వెదజల్లే పద్ధతి మేలు



వెదజల్లే పద్ధతి వరిసాగును పరిశీలిస్తున్న ఏఓ

నెక్కొండ : రైతులు పాతపద్ధతిలో వరి సాగు చేస్తే ఎకరాకు సుమారు రూ.20వేలు వరకు ఖర్చు అవుతుంది. దీనికి తోడు సమయానికి కూలీలు దొరకక రైతులు పడే బాధ వర్ణనాతీతం. దీనికి ప్రత్యామ్నాయంగా నాటు వేయకుండా వరి సాగులో వెదజల్లే పద్ధతి ఎంతో మేలని ఏఓ ఎగిడి నాగరాజు అన్నారు. మండలంలోని అప్పల్‌రావుపేట గ్రామానికి చెందిన తిప్పని సుధాకర్ నాలుగు ఎకరాలవరి సాగులో నేరుగా వెదజల్లే పద్ధతిపై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో వరి సాగు ఖర్చులు పెరగడం, కూలీల కొరత ఉండడంతో రైతులంతా దమ్ము చేసిన పొలంలో నేరుగా వరి విత్తనాలను వెదజల్లడం ఆరు తడి పద్ధతిలో మెట్ట వరి సాగు చేయడం వలన మూసపద్ధతితో పోల్చితే తక్కువ ఖర్చుతో, అధిక దిగుబడులు సాధించ వచ్చునన్నారు. రైతులు యజమాన్య పద్ధతులు పాటించాలని ఆయన సూచించారు. ఈ పద్ధతిలో 45 రోజుల వరకు కలుపును సమర్థవంతంగా నివారించినట్లయితే మంచి ఫలితాలు పొందవచ్చునని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అరుణ్‌కుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఆశయాలను కొనసాగించాలి



గణేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

నర్సంపేట : గణేష్ ఆశయాలను కొనసాగించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం గణేష్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ విద్యార్థి సంఘంలో గణేష్ కీలక పాత్ర పోషిస్తూ ప్రజలపై జరుగుతున్న అణిచివేతలు, దోపిడీని కూల్చివేయాలని పోరాట దారిలో అడుగులు వేసి తన ప్రాణాన్ని సైతం లెక్క చేయలేదన్నారు. గణేష్ ఆశయాల స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్రాల కిరాతక పాలనను ఎండగట్టేందుకు అనేక ఉద్యమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేసే దిశలో పయనిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరచి ప్రజలకు, ప్రజాస్వామ్యానికి సరైన పాలనను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మొగిలిచర్ల సందీప్, గుర్రం అజయ్, ఆబర్ల విక్రం, రవి, సుమన్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సంకల్ప రథయాత్రకు ఆర్‌పీఐ మద్దతు

నర్సంపేట : తెలంగాణ వ్యాప్తంగా టీఎస్ సీపీఎస్ఈయూ ఈనెల 16 నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు చేపట్టే సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల పాత పింఛన్ సాధన సంకల్ప రథయాత్రకు ఆర్‌పీఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆర్‌పీఐ రాష్ట్ర కార్యదర్శి జన్ను సాంబయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ ఉద్యోగుల హక్కులను కాలరాస్తూ నూతన జీఓల ద్వారా ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీస్తూ ప్రతి నెల 5వ తేదీన ఇవ్వాల్సిన జీతాలు 20వ తేదీ వరకు ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. తెలంగాణ ప్రాంత ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేసి ప్రతి నెల 5వ తేదీలోపు జీతాలు ఇచ్చే విధంగా ప్రభుత్వంపై ఉద్యోగ సంఘాలు తీవ్రమైన పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

జీపీ కార్యదర్శికి వినతి

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందలో భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి జెండా గద్దె నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని గురువారం జిల్లా అధ్యక్షుడు ఎండీ షరీఫ్ స్థానిక పంచాయతీ కార్యదర్శి రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ.. 75ఏళ్లుగా అణచివేతకు గురైన దివ్యాంగులు సమాజంలో ఆత్మగౌరవంతో బతికేందుకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో జెండా గద్దెలు నిర్మిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సర్పంచ్ సుంకరి సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రంజిత్, రమాదేవి, జయప్రసాద్, బిక్షపతి, రాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

వర్ధన్నపేట : పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని శ్రీలక్ష్మినరసింహ ఆస్పత్రి అధినేత డాక్టర్ సంధ్యారాణి అన్నారు. బాల వికాస స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం బాలవికాస కార్యాలయంలో సంధ్యారాణి పలు వ్యాధులపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్, కిడ్నీ, బీపీ, షుగర్ తదితర వ్యాధులు రాకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అహారపు అలవాట్లు తదితర అంశాలను వివరించారు. ఈ అవగాహన సదస్సుకు వర్ధన్నపేట, జఫర్‌గఢ్, రాయపర్తి మండలాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు. బాలవికాస ప్రతినిధులు రాణి, సరళ, ఫాతిమా, అనురాధ, చందన పాల్గొన్నారు.

దిష్టిబొమ్మల దహనం హేయం

ఖానాపురం : బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పులు కప్పిపుచ్చుకోవడానికే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం చేస్తున్నారని, ఇది హేయమైన చర్య అని నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్ల జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కమీషన్‌ల కోసం పని చేసే బీఆర్ఎస్ నాయకులకు తగిన గుణపాఠం తప్పదన్నారు. తెలంగాణ ప్రభుత్వ మోసాలు బయటపడతాయనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ నాయకులు భయాందోళనకు గురవుతున్నారన్నారు.

రెయిన్‌కోట్‌ల పంపిణీ

రాయపర్తి : గ్రామపంచాయతీ సిబ్బందికి లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణీ ఆధ్వర్యంలో గురువారం రెయిన్‌కోట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్ కుందూరు వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మండలంలోని సన్నూరు గ్రామపంచాయతీ సిబ్బందికి రెయిన్‌కోట్‌లను అందించినట్లు సర్పంచ్ నలమాస సారయ్య తెలిపారు.

శివాలయానికి విరాళం..

సంగెం: మండలంలోని ఎల్గూర్‌రంగంపేట శివాలయం గర్భగుడికి రూ.30వేల విలువైన స్టెయిన్‌లెస్ స్టీల్ గ్రిల్స్ డోర్లను పెద్దగోని ప్రవీణ్ గురువారం అందజేశారు.

పరామర్శ

గీసుకొండ : మండలంలోని మరియపురం గ్రామానికి చెందిన అడ్డాల వీరాబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా బాధిత కుటుంబ సభ్యులను గురువారం రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు పరామర్శించారు. జెండా రాజేశ్, మోర్తాల చందర్ రావు, శ్రీనివాస్‌రెడ్డి అడ్డాల బీమారావు, రంపీస మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మొలకెత్తని వరి విత్తనాలు..

చెన్నారావుపేట: మండలంలోని ధర్మతండా, తిమ్మరాయినిపహాడ్ గ్రామానికి చెందిన రైతులు వరి విత్తనాలు మొలకెత్తకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ధర్మతండాకు చెందిన భూక్యా వీరాసింగ్ తొమ్మిది ఎకరాలలో వరి సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో సాయివర్ష కంపెనీకి చెందిన '1224' అనే రకం వరి విత్తనాలు తొమ్మిది బస్తాలు, తిమ్మరాయినిపహాడ్‌చెందిన రాజు ఆరు బస్తాలను నర్సంపేట పట్టణంలోని ఓ షాపులో కొనుగోలు చేశారు. నారు కోసం విత్తనాలను 24 గంటలు నీటిలో నానబెట్టి మూడు రోజులు మండె కట్టినట్లు తెలిపారు. విత్తనాలు మొలకెత్తకపోవడంతో దుకాణ యజమానిని సంప్రదించగా పొంతన లేని సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.